సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
గురువారం 27 మార్చి 2025 పేజీలు 8
గుంటూరు పల్నాడు


# నిర్యాణము



## కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) గారు

జననం : 15-06-1948 మరణం : 13-03-2025

మా త్రండిగారైన

**కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) గారు**

చైర్మన్ కమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,

భారతి కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్

ది. 13-03-2025 గురువారం నాడు "స్వర్గస్తులైనారు".. కావున ది. 28-03-2025 శుక్రవారం గుంటూరు, అరండల్‌పేట 10/2లోని మా స్వగృహము "అరుణాచలం ప్యాలెస్" నందు "పెద్దకర్మ" కార్యక్రమము జరుగును. విందు : మధ్యాహ్నం గం.12-00లకు "శ్రీ కన్వెన్షన్", మహాత్మగాంధి ఇన్నర్ రింగ్‌రోడ్, 2వ ఫేస్, గోరంట్ల, గుంటూరు నందు జరుగును. కావున తెలియపరచడమైనది.

ఇట్లు, కుమారుడు

**పర్విన్‌రాజ్ మాణిక్యవేల్ మరియు కుటుంబ సభ్యులు**

# గురజాలలో రెవెన్యూకి అవినీతి రోగం.!



- వీఆర్వో నుంచి తహశీల్దార్ల వరకు విస్తరించిన అవినీతి గొలుసు
- ఐ వి ఆర్ ఎస్ సర్వేలో బయటపడ్డ వీఆర్వో, సర్వేయర్ల బాగోతం
- వీఆర్వోలు,సర్వేయర్లకు షోకాస్ నోటీసులు జారీ
- ఉద్యోగాల నుంచి తొలగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు
- లంచాలకు మరిగిన అధికారులు ప్రజలకు అవసరమా..

పల్నాడు జిల్లా గురజాల రెవెన్యూ శాఖ అవినీతి ఊబిలో కూరుకుపోయింది. వీఆర్వోలు పెద్ద ఎత్తున లంచాలలో. మునిగి తేలుతున్నారు పట్టాదారు పాస్ పుస్తకాల జారీ కోసం గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు ), మండల రెవెన్యూ అధికారులు (ఎమ్మార్వోలు), విలేజ్ సర్వేయర్లు రైతుల నుంచి లంచాలు వసూలు చేస్తున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్నాయి. గురజాల రెవెన్యూ డివిజన్‌లో 28 మంది వీఆర్వోలు, 12 మంది సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ కాగా, ఇటీవలి గణాంకాలు ఈ అవినీతి లోతును బహిర్గతం చేస్తున్నాయి. పల్నాడు జిల్లా గురజాలలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రూ.1, 000 నుంచి రూ. 2000 వరకు లంచాలు వసూలు చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. ఐ.వి.ఆర్.ఎస్ సర్వేలో ఈ విషయం బయటపడడంతో ఆర్డీఓ మురళీకృష్ణ 28 మంది వీఆర్వోలకు , 12 మంది సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. “లంచం ఇవ్వకపోతే నెలల తరబడి ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తుంది,” అని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

**విశాఖపట్నంలో**

ఆంధ్రప్రదేశ్ యాంటీ-కరప్షన్ బ్యూరో 2016లో 17 మంది రెవెన్యూ అధికారుల ఇళ్లపై దాడులు చేసి కోట్ల రూపాయల అక్రమ సంపాదనను గుర్తించింది. ఆ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 62 కేసులు నమోదయ్యాయి, వీటిలో విశాఖ జిల్లా 82 కేసులతో అగ్రస్థానంలో నిలిచింది.అనంతపురం 2015లో ఫేక్ పాస్‌బుక్ అనంతపురం జిల్లాలో వేలాది నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు బ్యాంకు రుణాల కోసం ఉపయోగించిన ఘటన బయటపడింది. 2016 నుంచి 2019 మధ్యకాలంలో ఏసీబీ డేటా ప్రకారం రెవెన్యూ శాఖలో నాలుగేళ్లలో 35 శాతం అవినీతి, అక్రమ ఆస్తుల కేసులు నమోదయ్యాయి. ఇది పోలీసు శాఖ లో 15శాతం , మున్సిపల్ శాఖ లో 12శాతం కంటే ఎక్కువ. 2016లో విశాఖ జిల్లాలో 82 ఏసీబీ కేసులు నమోదు కాగా, కర్నూలు 61, కృష్ణా 51 జిల్లాలు వెనుకంజలో ఉన్నాయి. 2019లో 54 కేసుల్లో 31 మందికి శిక్ష పడగా, 57.4శాతం శిక్షా రేటు మాత్రమే నమోదైంది. 2018లో 51.25శాతం , 2017లో 51.1శాతం ఉండటం గమనార్హం. మీభూమి పోర్టల్ ప్రకారం, 2024 నాటికి ఏపీలో 1.5 కోటి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ అయ్యాయి, కానీ వీటిలో 10శాతం వరకు అవినీతి ఫిర్యాదులు వచ్చాయి.

**రైతుల కష్టాలు**

“మా హక్కు కోసం ఎందుకు డబ్బు కట్టాలి?” అని గురజాలకు చెందిన రైతులు ప్రశ్నిస్తున్నారు . చిన్న రైతులు, ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారు ఈ లంచాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. “డిజిటల్ ఇండియా అంటారు, కానీ ఇక్కడ లంచం లేకపోతే పాస్ పుస్తకం రాదు,” అని విజయవాడ సమీపంలోని ఒక రైతు ఆరోపించాడు.అవినీతి నెట్‌వర్క్భానిక వర్గాల ప్రకారం, వీఆర్వోలు, సర్వేయర్ల నుంచి ఎమ్మార్వో ల వరకు అవినీతి గొలుసు విస్తరించి ఉంది. “కింది స్థాయి నుంచి వసూలు చేసిన డబ్బు పైకి పంచుకుంటారు,” అని ఒక సామాజిక కార్యకర్త తెలిపారు. 2016లో విశాఖలో జరిగిన దాడులు ఈ వ్యవస్థీకృత దోపిడీకి ఆధారాలుగా నిలుస్తున్నాయి.ప్రభుత్వ స్పందనరాష్ట్ర ప్రభుత్వం మీభూమి పోర్టల్ ద్వారా డిజిటలైజేషన్‌ను ప్రోత్సహిస్తున్నప్పటికీ, గురజాల ఘటన ఈ వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపింది.

పల్నాడు జిల్లా గురజాలలో అనేకమంది వీఆర్వోలు , సర్వేయర్లు అక్రమాలలో మునిగి తేలుతున్నారు. కూటమి ప్రభుత్వానికి తీరని మచ్చ తెస్తున్నారు. గురజాల డివిజన్లో 26 మంది వీఆర్వోలకు ఆర్డిఓ షో కాస్ నోటీసులు ఇచ్చి షాక్ ఇచ్చారు. దీనిని బట్టి ఇక్కడ రెవెన్యూ సిబ్బంది ఎంత మేరకు లంచాలు గుంజుతున్నారో ఇట్టే తెలుసుకోవచ్చు. ఈ నోటీసులు కూడా అవినీతిపరులకి ఇవ్వడం విశేషం. వీరందరిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పాస్ పుస్తకానికి, డెత్ సర్టిఫికెట్ కి, బర్త్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కు పెద్ద ఎత్తున లంచాలకు డిమాండ్ చేస్తున్నారు. అడిగిన కాడికి డబ్బులు ఇవ్వకపోతే వీఆర్వోలు పలు కొర్రీలు వేసి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రజలను రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిప్పుతున్నారు. ఒకటేమిటి అన్ని సర్టిఫికెట్లకు ఈ డివిజన్లోని వీఆర్వోలు చేతులు చాచి ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారనే. అభి యోగాలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీనిపై తాత్కాలికంగా విచారణ చేసిన ఆ డివిజన్ ఆర్డిఓ వీఆర్వోలకు షాక్ ఇచ్చారు. లంచాలకు మరిగిన వీఆర్వోలపై కొంతమంది స్థానికులు ఏసీబీకి నేరుగా ఫిర్యాదు చేసినట్లు కూడా తెలిసింది. ఎమ్మార్వోలు, వీఆర్వోలు, సర్వేయర్ల ఆస్తులపై వారి బినామీదారులపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కూడా ఇటీవల ఏసీబీకి ఫిర్యాదులు రావటం విశేషం....

పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

# పార్టీ రంగులు పులుముకున్న బార్ ఎన్నికలు



- నేడు సత్తెనపల్లి బార్ ఎన్నికలు
- ఢీ అంటే ఢీ అంటున్న ఇద్దరు న్యాయవాదులు.
- గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతి వ్యూహాలు

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బారు అసోసియేషన్ ఎన్నికలు సత్తెనపల్లిలో ఆసక్తికరంగా మారాయి. గతంలో ఒకే ఆఫీసులో పనిచేసిన సీనియర్ జూనియర్ న్యాయవాదులు అధ్యక్ష పదవికి పోటీ పడటం మరింత ఉత్కంఠకు తెరలేపింది. భారీ ఎన్నికలు రాజకీయ రంగును కులుకుపోతుంటే నువ్వా నేనా అన్నట్లు పోటీ జరుగుతుంది. అభ్యర్థుల సైతం టిడిపి లీగల్ సెల్ కు చెందిన ముగ్గురు గంగూరి అజయ్ కుమార్ అధ్యక్ష పదవికి పోటీ పడుతుండగా, ఉపాధ్యక్షుడు గా సర్వేపల్లి సీతారామాంజనేయులు, సబ్ కోర్టు కార్యదర్శిగా జానీ ఖాజావలి, జనసేనకు చెందిన బయ్యవరపు నరసింహారావు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యదర్శిగా పోటీలో ఉన్నారు. మరోవైపు తెలుగుదేశం పార్టీకి మరోపక్క రాష్ట్ర పౌర హక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అధ్యక్ష పదవి పోటీ పడుతూ, ఉపాధ్యక్షుడిగా వైసిపి లీగల్సన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిన్న మణిబాబు పోటీ పడుతున్నారు. మరోవైపు 2024 ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన జొన్నలగడ్డ విజయకుమార్ సబ్ కోర్ట్ కార్యదర్శిగా పోటీలో ఉన్నారు. వైసిపి లీగల్ సెల్ కు చెందిన పొత్తూరి హరి మణికంఠ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్యదర్శిగా పనిలో ఉన్నారు. ఆయా పార్టీలకు సంఘాలకు చెందిన న్యాయవాదులు పోటీ పడుతుండటంతో ఈ ఎన్నికలు నియోజకవర్గంలో హార్ట్ టాపిక్ గా మారాయి. న్యాయవాదుల సైతం పోటీని ప్రతిష్టంగా తీసుకోవడంతో ఎన్నికలు పై జనాలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. సాధారణ ఎన్నికలకు తీసుకొని విధంగా న్యాయవాదులు తమదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరు వర్గాలు పార్టీలిస్తూ, మంతనాలు చేస్తూ, ఎత్తులు పై ఎత్తులతో రసవత్తరంగా మారింది. 146 మంది సభ్యులు ఉన్న ఈ ఎన్నికలు నియోజకవర్గ మొత్తం హీటెక్కిస్తున్నాయంటే అతిశయొక్తి కాదు. ఏది ఏమైనప్పటికీ రేపు సాయంత్రానికి న్యాయవాదుల బార్ ఎన్నికల ఉత్కంఠకు తెరపడనుంది.



# కార్యకర్తకు అండగా ఉంటా

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

అధినేత ఎంత గొప్పవారైనా, కార్యకర్తల మద్దతు లేకుండా విజయం సాధించడం అసాధ్యమని, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిధి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం కార్యకర్తే అధినేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలు తమ భుజస్కందాలపై నిలుపుకుని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారని, అలాంటి కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని చెప్పారు. అర్ధరాత్రయినా, అపరాత్రయినా కార్యకర్తకు కష్టమొస్తే అరక్షణం కూడా ఆలోచించకుండా వస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు.తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు బీమా అందించడం ద్వారా వారి కుటుంబాలకు తోడుగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు శ్రమకు తగిన ప్రతిఫలం తెలుగుదేశం పార్టీలో మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. నాయకుడు, కార్యకర్తల మధ్య సత్సంబంధాలే విజయానికి మూలమని పేర్కొన్నారు. కలిసికట్టుగా గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.

# ప్రజల చెంతకే పరిష్కారం

- ప్రజాదర్బార్ లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్
- ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని హామీ
- ఎమ్మెల్యే స్వయంగా రావడంతో సంతోషం
- పెన్షన్లు, రేషన్ కార్డులు, మంచినీళ్ల సమస్యలపై అధికంగా అర్జీలు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఒక్కొక్కరిది ఒక్కొక్క సమస్య. అధికారుల చుట్టూ తిరిగి అలసిసిపోయిన వారు కొందరు.. అసలు ఎవరిని అడగాలో తెలియక మరికొందరు.. ఇలాంటి సమయంలో సమస్యలు ఉంటే చెప్పండి పరిష్కారం చూపుతాను అంటూ నియోజకవర్గ ఎమ్మెల్యే స్వయంగా తమ ప్రాంతానికి రావడంతో ప్రజలకు సంబరపడ్డారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఎనిమిదో డివిజన్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం ఎమ్మెల్యే నసీర్ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నసీర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అయ్యా.. రేషన్ కార్డు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. కార్డు లేకపోతే పథకాలేమీ ఇవ్వరంటా.. తినడానికి బియ్యం కూడా రావడం లేదని ఒకరు.. పెన్షన్ మీదే బతుకీడ్చేటోళ్లం. పోయిన ప్రభుత్వంలో పింఛన్ తీసేశారు. పస్తులతో కాలం గడుపుతున్నాం.. మీరే ఆదుకోవాలయ్యా అంటూ మరొకరు.. నీళ్లు ఒక రోజు వస్తే మరో రోజు రావు.. కుళాయిలు లేవు, అంటూ ఇంకొకరు ఇలా అనేక సమస్యలను ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, సావధానంగా వారి సమస్యలను ఎమ్మెల్యే ఆలకించారు. అర్హులకు ఎందుకు ప్రభుత్వ సేవలు అందడం లేదనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి వెంటనే ప్రభుత్వ సేవలు అందించాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని, ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటిస్తూ, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని వెల్లడించారు. అనంతరం సంబంధించిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ధనలక్ష్మి, రాష్ట్ర నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఎల్లావుల అశోక్,జ్యోతుల జస్వంత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, జాడ సతీష్, శీను నాయక్, ఐలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 30న ఉగాది పండుగ సంబరాలు

నర్సాపేట మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇస్సా పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఉన్న శ్రీ వాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రం నందు ఉగాది పండుగ సందర్భంగా మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు విచ్చేసిన ప్రభల నిర్వాహకులకు మరియు ఇస్సాపాలెం దేవస్థానానికి తిరునాళ్లకు విచ్చేసిన ప్రభల నిర్వాహకులకు సుమారు 50 మందికి సత్రం కన్వీనర్ బత్తుల మురళి ఆధ్వర్యంలో ఘన సన్మానం ఏర్పాటు చేయడం జరుగునని బత్తుల మురళి తెలియజేసినారు. కార్యక్రమమునకు సంబంధించిన కరపత్రాలను కన్వీనర్ బత్తుల మురళి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో చేగు వెంకటేశ్వరరావు, రావి క్రింది వెంకటసుబ్బారావు, వెల్లంపల్లి కేశవరావు, కే ఎం ఎల్ ప్రసాద్, ఏ వి ఆర్ కే సత్యనారాయణ, తాడువాయి శ్రీనివాసరావు, బొగ్గరపు బ్రహ్మానందం, జల్లి శ్రీనివాసరావు, ప్రభల నిర్వాహకులు లక్ష్మీనారాయణ, కోట వాణి దేవిశెట్టి సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, కోటప్పకొండ ఈవో డి.చంద్రశేఖర్, ఎస్ఎఫ్ పాలెం దేవస్థానం ఈవో ఎం మాధవి దేవి,కనుమూరి రాజ్యలక్ష్మి, కొల్లి బ్రహ్మయ్య, కడం నాగజ్యోతి తదితరులు పాల్గొంటారు.

## ఫ్రీ గ్యాస్ సిలిండర్ ఈ నెలాఖరు వరకే గడువు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్** : ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఈ నెలాఖరు వరకే గడువు – ఈ గ్యాస్ తీసుకున్న 48 గంటల్లోపే ఖాతాలో డబ్బులు జమ దీపం – 2 పథకంలో భాగంగా మొదటి ఫ్రీ గ్యాస్ సిలిండర్ పొందే%శ్%దుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉంది. ఇప్పటివరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇప్పటికే ప్రకటించారు. ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇచ్చే ఈ స్కీమును క తేడాది చివరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. ఏప్రిల్ నుంచి జూలై, ఆగస్టు నుంచి నవంబర్, డిసెంబర్ నుంచి మార్చి మధ్యలో, అంటే నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఫ్రీ గ్యాస్ సిలిండర్లు పొందవచ్చు.

# ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో 15% వృద్ధి లక్ష్యంగా ప్రణాళిక

**సీఎంకు వివరించిన జిల్లా కలెక్టర్**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలో ప్రాధాన్యతమైన వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇండస్ట్రీ రంగం, సర్వీస్ రంగాల్లో 2025 – 26 సంవత్సరానికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించటం జరిగిందని, వచ్చే సెప్టెంబరులో గుంటూరులో చిల్లీ కాంక్లేవ్ పేరిట ఒక పెద్ద సదస్సు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుచున్న 3వ కలెక్టర్ సమావేశంలో బుధవారం రెండవ రోజు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ జిల్లాలో 2025–26 సంవత్సరానికి గాను కార్యాచరణ ప్రణాళికను జిల్లాకు సంబంధించిన నిర్దిష్ట సమస్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. వ్యవసాయ వ్యవసాయ అనుబంధ రంగాలు, వ్యవసాయం, హార్టికల్చర్, పశువులు, అడవులు, ఫిషింగ్ మరియు ఆక్వా, ఇండస్ట్రీ రంగంలో మైనింగ్ మరియు క్వారీయింగ్, మ్యానుఫ్యాక్చరింగ్, విద్యుత్తు, గ్యాస్ మరియు నీటి సరఫరా, నిర్మాణం సర్వీస్ రంగంలో ట్రేడ్, హోటల్స్, మరియు రెస్టారెంట్లు, రైల్వేస్, ట్రాన్స్ పోర్టు, స్టోరేజీ, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ , ఓనర్ షిప్ ఆఫ్ డ్వాలింగ్స్, ప్రొఫెషనల్ సర్వీస్, ఇతర సర్వీసులు, సంక్షేమం, లా అండ్ ఆర్డర్ వంటి 19 ప్రముఖ రంగాలలో గ్రోత్ రేట్ పెరుగుదలకు నిర్దేశిత లక్ష్యాలు, వాటిని అధిగమించేందుకు నిర్దేశించుకున్న సమయాలను తెలుపుతూ కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాలలో జీడీవీఏ వృద్ధి రేటు 14.90% , ఇండస్ట్రీ రంగానికి 21.29 శాతం, సర్వీస్ రంగంలో 16.01 శాతం లక్ష్యంగా 2025 %-% 26 ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లాలో జీడీవీఏ లో ఉద్యాన పంటలు, పశుసంవర్ధక శాఖలు ప్రధానమైనవన్నారు. సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆమె తమ జిల్లా ప్రగతికి సంబంధించి ప్రజెంటేషన్ ఇచ్చారు. గుంటూరులో మిర్చి సాగు విస్తారంగా చేస్తారని, ప్రస్తుతం జిల్లాలోని శీతల గోదాముల్లో 40 లక్షల బస్తాల మిర్చి ఉందన్నారు. ఎగుమతి మార్కెట్ ప్రస్తుతం ఆశాజనకంగా లేకపోవడంతో మంచి ధరల కోసం రైతులు తమ పంటను గోదాముల్లో భద్రపరచుకున్నారని తెలిపారు.

వ్యవసాయం రంగంలో రబీలో పంటల సాగును 86,000 హెక్టార్ల నుంచి 91,000 హెక్టార్లకు, ప్రకృతి వ్యవసాయం ను 26,000 హెక్టార్ల నుంచి 50,000 హెక్టార్లకు, కౌలు రైతులకు పంట రుణాలు రూ 58 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనికోసం సాయిల్ ఫెర్టిలిటీని పెంచేలా పీఎండీఎస్ కిట్ లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఉద్యాన పంటలలో గ్రోత్ ఇంజిన్ పంటలైన మిరప, పసుపు, కురగాయలు, పూల సాగును 17800 హెక్టార్ల నుంచి 18400 హెక్టార్లకు పంటల సాగును పెంచాలని, మైక్రో ఇరిగేషన్ పంటల సాగును 12100 హెక్టార్ల నుంచి 14,500 హెక్టార్లకు పెంచాలని, పోస్ట్ హార్వేస్ట్ మ్యానేజ్మెంట్ మరియు ప్రొడక్ట్ పరఫక్షన్ కు సంబంధించి రూ. 16 కోట్లు ఖర్చు చేయాలని ప్రణాళికల్లో రూపొందించామన్నారు. దీని కోసం పంటలలో చీడ పురుగుల నివారణకు మిలిందా ఫౌండేషన్ తో ఈ మిర్చిని డిజిటల్ గ్రీన్ ద్వారా అమల్లోకి తీసుకు వస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి 1.3 మెట్రిక్ టన్నుల దాణాను వృద్ధి చేసేలా, పాలిచ్చే గేదెలను, కోళ్ళ పెంపకానికి 2000 నూతన యూనిట్స్ ఏర్పాటుతో పాటు, 60 లక్షల లీటర్ల అదనపు పాల ఉత్పత్తి కి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఫిషింగ్ మరియు ఆక్వా రంగానికి సంబంధించి ఫిష్ సీడ్ ను 49,000 మెట్రిక్ టన్నుల నుంచి 62,000 మెట్రిక్ టన్నులకు పెంచాలని, పీఎంఎంఎస్వై పథకాలకు 0.93 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. అడవుల విస్తీర్ణం, పచ్చదనం పెంపుదలలో భాగంగా నర్సరీ పెంపుదలకు ఐదు లక్షల విత్తనాలు, శాంపిల్లింగ్ ప్లాంటేషన్ కు 8 లక్షల శాంప్లింగ్స్, ఐదు వెట్ ల్యాండ్స్ ను డిమార్కింగ్ చేయటం జరుగుతుందన్నారు. ఇండస్ట్రీ రంగానికి సంబంధించి మైనింగ్ మరియు క్వారింగ్ లో 40 నాన్ వర్కింగ్ మెటల్ లీజ్ ద్వారా 20 లక్షల మెట్రిక్ టన్నులు, 20 నూతన గ్రావెల్ లీజ్ ద్వారా 10 లక్షల క్యూబిక్ మెటల్, 30 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వకాలు చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మాన్యుఫ్యాక్టరింగ్ లో 2500 నూతన ఎంఎస్ఎంఈలు ఏర్పాటు, రెండు మెగా ఇండస్ట్రీలకు 304.75 హెక్టార్లు భూసేకరణ చేయటం జరుగుతుందన్నారు. విద్యుత్ నెట్ వర్కింగ్ 10 శాతం పెంపుదలకు (3700ఎంయూ నుంచి 4200ఎంయూ) రూ. 111.33 కోట్లు ఖర్చు చేయాలని, గ్రీన్ ఎనర్జీ పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా 56 మెగావాట్లు , ఎంటీఎంసీ లోని ఐఓసీఎల్ ద్వారా 5000 ఇళ్ళకు పైపు ద్వారా గ్యాస్ సరఫరా చేయాలని, జల్ జీవన్ మిషన్ ద్వారా 25,000 ఇళ్ళకు వ్యక్తిగత కుళాయిలు, 4 ఎంఎల్డీ వాటర్ సోర్స్ పెంపుదలకు, పట్టణ ప్రాంతాల్లో 25,000 ఇళ్ళకు వ్యక్తిగత కుళాయిలు ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నిర్మాణాలకు సంబంధించి రహదారులు (ఆర్ అండ్ బీ, పీఆర్ మరియు మున్సిపల్) రూ.233.96 కోట్లతో 142 కిమీ నిర్మాణం, జాతీయ రహదారి ఎన్ హెచ్ 16 నాలుగు కిలోమీటర్లు ఆరులైన్ల రహదారికి, రెండు మూడు లైన్ల ఆర్వోబీలు రూ. 454.24 కోట్లుతో , గుంటూరులో శంకర్ విలాస్ ఆర్వోబీ , 200 మీటర్ల అప్రోచ్ రోడ్లు రూ.40 కోట్లతో నిర్మించాలని లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. సర్వీస్ రంగానికి సంబంధించి లక్ష్యాలను వివరించారు. జిల్లా యొక్క జీడీవీఏ 82293 (17.36 శాతం) , జీడీడీపీ 89639 (17.96 శాతం) ప్రజల పర్ క్యాపిటల్ ఇన్కమ్ రూ.3,54,268 (17.66 శాతం) సాధించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాచరణ ప్రణాళికతో పాటు జిల్లాకు చెందిన గుంటూరు నగర పాలక సంస్థలో నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆర్థిక సహాయం, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో యూజీడీ పనులకు, మంచినీటి సరఫరా విస్తరణకు, గుంటూరు ఛానల్ ఆధునీకరణ, విస్తరణకు నిధులు, చినకాకాని, మల్లయపాలెంలో ఇండస్ట్రీల పార్కు ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రూ.625 కోట్లు నిధులు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న మెటర్నిటీ వార్డులో పరికరాలు, ఫర్నిచర్ కు అవసరమైన నిధులకు ప్రభుత్వ సహకారం కావాలని జిల్లా కలెక్టర్ కోరడం జరిగింది. వీటిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పెండింగ్ లో ఉన్న యూజీడీ పనులు పూర్తి చేస్తామన్నారు. ఎంటీఎంసీ పరిధిలో యూజీడీ, మంచినీటి సరఫరాకు సీఆర్డీఏ ద్వారా నిధులు కేటాయింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణ, విస్తరణకు, చినకాకాని, మల్లయపాలెం వద్ద ఇండస్ట్రీ పార్కు భూసేకరణకు నిధులు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. జీజీహెచ్ లో మెటర్నిటీ వార్డులో పరికరాలు, ఫర్నిచర్ నిధులు మంజూరుపై వైద్యారోగ్యశాఖ అధికారులు పరిశీలన చేయాలన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. నరసింహారావు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, సీపీఓ శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

**▸▸ జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టినా వెల్లడి ▸▸ త్వరలో సమావేశ తేదీ వెల్లడిస్తాం**

**గుంటూరు జిల్లా పరిషత్, మేజర్ న్యూస్** ఈనెల 29వ తేదీన గుంటూరులో జరగనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా బుధవారం తెలిపారు. 2025- 26వ సంవత్సర బడ్జెట్ లో ప్రభుత్వ పథకాలను అదనంగా చేర్చాలని, అదే విధంగా మెజార్టీ సభ్యులు కొంత సమయము కోరిన కారణంగా వాయిదా వేసినట్లు చైర్ పర్సన్ తెలియ చేశారు. తిరిగి సర్వసభ్య సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె వివరించారు.

## సమస్యల పరిష్కారానికే పబ్లిక్ గ్రీవెన్స్



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :-**

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లక్ష్యమని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు.పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు.నియోజకవర్గంలో పలు స్థలా వివాదాలు పై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా,చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు.స్పందించిన ఆయన వెంటనే వీటి పై విచారణ చేసి,కబ్జాకు పాల్పడిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్లు, రేషన్ కార్డులతో ప్రజలు అధిక సంఖ్యలో వినతులు అందించారు.ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు విన్నవించారు.కొన్ని సమస్యలను ఎమ్మెల్యే డా.చదలవాడ అక్కడిక్కడే పరిష్కరించారు.అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతల భూ అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తున్నా యన్నారు. వారి పై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం ప్రజలకోసం ఆలోచిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందన్నారు.కళ్లుండి చూడలేని నాయకుడు జగన్మోహనరెడ్డి అన్నారు. సంక్షేమమే అభివృద్ధిగా కూటమి ప్రభుత్వం ముందు కెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో భర్తకు 7 ఏళ్ల జైలు శిక్ష

**మంగళగిరి మేజర్ న్యూస్ :**

భార్యపై కత్తితో హత్యాయత్నంకు పాల్పడిన భర్తకు 7 ఏళ్ల జైలు శిక్ష పడింది. తాడేపల్లి కి చెందిన సంధ్య రాణి పై భర్త తగరపు నాగరాజు కత్తి తో దాడి చేసి హత్యాయత్నం కు పాల్పడ్డాడు. 03, సెప్టెంబర్ 2022 న బాధితురాలి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోర్టు విచారణలో నాగరాజు పై నేరం రుజువు కాగా,మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని బుధవారం తీర్పు వెలువడించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసక్యూటర్ రెంటపల్లి రాజేష్ బాధితురాలి తరుపున వాదనలు వినిపించారు.

## ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు

**- జిల్లా విద్యాశాఖాధికారి, సి.వి. రేణుక**

**గుంటూరు జిల్లా పరిషత్, మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన 10వ తరగతి పరీక్షలు 150 కేంద్రాలలో ఏపీఓఎస్ ఎస్ (ఎస్ ఎస్ సి ) పరిక్షలు 21 కేంద్రాలలో ప్రశాంతంగా జరిగినట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి, సి.వి. రేణుక తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 10వ తరగతిలో 27576 విద్యార్థులకుగాను 27405 హాజరైనట్లు, 171 మంది గైరుహాజరైనట్లు, 297 మంది ప్రైవేటు అభ్యర్థులలకు గాను 230 మంది హాజరైనట్లు ఏపీఓఎస్ ఎస్ పరీక్షకు 1091 మందికి గాను 830 మంది హాజరైనట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక 03 పరీక్ష కేంద్రాలను, అసిస్టెంట్ కమీషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్, గుంటూరు వారు 03 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 52 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు సి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు.

# కొత్త పుల్లారెడ్డి గూడెం, మొరసపెంట గ్రామాలలో విజయవంతంగా నవోదయం 2 కార్యక్రమం

- ▸▸ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులు.
- ▸▸ నాటు సారా వలన కలిగే నష్టాలను వివరించిన వైనం.
- ▸▸ భావితరాల భవిష్యత్తును కాపాడుకోవాలని సూచన.
- ▸▸ అక్రమ నాటు సారా తయారీ, అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక.



గ్రామస్తులు నవోదయం ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం..



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :**

వెల్దుర్తి మండలంలోని కొత్త పుల్లారెడ్డిగూడెం, మొరసపెంట గ్రామాలలో మంగళవారం నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాటు సారా తయారీ వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా చట్టరీత్యా ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయో వారికి అవగాహన కల్పించారు. భావి తరాల భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకోకూడదని హితువు పలికారు. అదేవిధంగా నాటు సారా తయారీని అరికట్టడం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేసి, వారి బంగారు భవిష్యత్తు వారే బాటిల్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులచే నవోదయం ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా నాటు సారా తయారు చేసే వారి ఆచూకీ తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అలాంటి వారి వివరాలు తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 14405 కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, వెర్సెస్ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు, ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవి కుమార్ రెడ్డి, ఎస్ టి ఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్ కె.మణికంఠ, అసిస్టెంట్ ఎక్సైజ్ జి.సూర్య నారాయణ, మాచర్ల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్ వెంకటరమణ, వెల్దుర్తి మండల ఎంపీడీవో ప్రసాద్ రావు, వెల్దుర్తి ఎస్సై సంబంధర్ వలి, పంచాయతీ సెక్రటరీ, ప్రభుత్వ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం

- ఫీల్డ్ అసిస్టెంట్ కు పలు సూచనలు.
- టార్గెట్ ను పూర్తి చేయాలని ఆదేశాలు జారి.
- సమీక్ష సమావేశంలో మాట్లాడిన ఎంపీడీవో ప్రసాదరావు.



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో భాగంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలోని మండల పరిషత్ కార్యాలయం నందు ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రసాదరావు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి మండలం లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు రానున్న త్రైమాసిక సంవత్సరంలో పూర్తి చేయవలసిన టార్గెట్ల గురించి వివరించారు. అదేవిధంగా రైతులు తమ పంట పొలాల్లో నీటి గుంటలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ అంశంపై వారికి అవగాహన కల్పించాలని,అదేవిధంగా వారికి అవసరమైన సలహాలను సూచనను అందించాలని తెలియజేశారు. ప్రతి ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్ వారికి అప్పగించిన బాధ్యతను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరావు, ఏపీఒ రేఖా జ్యోతి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణులకు అపర కర్మల సత్రానికి స్థలం కేటాయించాలి

**- ఏపీ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు**



గుంటూరు మేజర్ న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ పాత గుంటూరు నందుగల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం నాడు గ్రీవెన్స్ నిర్వహించగా గుంటూరు నగరంలో నాయీ బ్రాహ్మణులకు అపరకర్మల సత్రం లేక ఇబ్బందులు పడుతున్నందున సత్రానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, ప్రతినిధి వర్గం శాసనసభ్యులు నసీర్ అహ్మద్ వినతిపత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా తాటికొండ నరసింహారావు మాట్లాడుతూ గుంటూరు నగరంలో నాయీబ్రాహ్మణులు క్షవర వృత్తిదారులు, వాయిద్య కళాకారులు, ఆర్ఎంపి అండ్ పిఎంపి వైద్యులు ఇతర అనేక పనులు చేసుకుంటూ పేద మధ్యతరగతి కుటుంబీకులు వేలాది మంది అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న తరుణంలో ఆయా సందర్భాలలో మృతి చెందిన మృతదేహాలను అద్దెకు ఉంటున్న ఇంటి ముందు పెట్టుకొనుటకు ఇంటి యజమానులు నిరాకరించటం ద్వారా అద్దెకు ఉంటున్న నాయీబ్రాహ్మణులు అపరకర్మల సత్రం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ స్పందిస్తూ మీరు కోరిన న్యాయమైన సమస్యని తప్పకుండా పరిష్కరిస్తామని నాయీబ్రాహ్మణులకు అపరకర్మల సత్రానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విజ్ఞాపన పత్రం అందచేసిన వారిలో నాయీబ్రాహ్మణ సౌందర్య శాలల సంక్షేమ సంఘం గుంటూరు అర్బన్ కమిటీ ఉపాధ్యక్షులు పి శ్రీమన్నారాయణ, నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు అర్బన్ కమిటీ కార్యదర్శి టి హరినాధ బాబు ఈసీ మెంబర్ వి చిన్న వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## త్రాగునీటి పైప్ లైన్ మరమత్తులు ఎప్పటికప్పుడు చేపట్టాలి



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**
గుంటూరు నగరపాలక సంస్థ పరధిలో త్రాగునీటి పైప్ లైన్ మరమత్తులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ పెద్దపలకలూరు, అడవితక్కెళ్లపాడు, నాయిబ్రాహ్మణ కాలనీ, నల్లపాడు, రాజీవ్ గాంధీ నగర్, వల్లూరివారితోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇంజినీరింగ్ అధికారులు త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయడంతోపాటుగా ఏఈలు వారీగా తమ పరిధిలో పైప్ లైన్ల మరమత్తులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పైప్ లైన్ల లీకుల వలన త్రాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా త్రాగునీటి సరఫరా సమయంలో క్లోరిన్ స్యాంపిల్స్ తీసి, ప్రతి రోజు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. నూతన రోడ్ల ఏర్పాటుకు ముందే డ్రైన్ల నిర్మాణం చేయాలని, డ్రైన్ టు డ్రైన్ రోడ్ నిర్మాణం జరిగేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. నాయిబ్రాహ్మణ కాలనీలకో పారిశుధ్య పనుల పై స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయా ప్రాంతాలను డ్రోన్ ద్వారా పరిశీలించి, పారిశుధ్య సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై శానిటేషన్ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిన్ పాయింట్ గా ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం డ్రైన్ల శుభ్రం జరగాలని స్పష్టం చేశారు. పర్యటనలో కార్పొరేటర్ సాంబిరెడ్డి, డిఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరి ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్‌ను కలిసిన ఎమ్మెల్యే డా.చదలవాడ



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :**
నరస రావుపేట జేఎన్టీయూ కళాశాల నందు జేఎన్టీయూ కళా శాల వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ సి ఎస్ ఆర్ కె ప్రసాద్‌ను నరసరా వుపేట శాసనసభ్యులు డా.చదల వాడ అరవింద బాబు మర్యాద పూర్వకంగా కలిశారు కళాశాల గురించి పలు సమస్యలపై చర్చించారు.

# పట్టాదారు సమస్యలను పరిష్కరిస్తాం..

## - ఆర్డీవో మురళీకృష్ణ గురజాల



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**
గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో 28 మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు, 12 మంది విలేజ్ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన గురజాల ఆర్డీవో మురళీకృష్ణ. విధి నిర్వహణలో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీఓ చర్యలు. ఐవీఆర్ఎస్ సర్వేలో వీఆర్వోలు, సర్వేయర్లపై ఫిర్యాదులు రావడంతో చర్యలు. పట్టాదారు సమస్యలను పరిష్కరిస్తాం. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ బుధవారం విడుదల చేసిన ప్రెస్ నోట్ లో రైతులు యొక్క భూ సమస్యలను పరిష్కరిస్తాం అన్నారు. వ్యవసాయదారుల భూ సమ స్యలు సమీపంలోని గ్రామ సచివాలయాల్లోకి వెళ్లి ఫిర్యాదు చేయవల సినదిగా కోరారు. అటువంటి ఫిర్యాదులను పరిశీలించి గ్రామ వీఆర్ఓ లకు పంపడం జరుగుతుందన్నారు. వీఆర్వోలు వ్యవసాయ భూముల సర్వే చేయాల్సిన ఉంటే పరిశీలించి, మండల సర్వేయర్ చేత సర్వే చేయించి ఇస్తామన్నారు. వన్ బి, అడంగల్, ఆన్లైన్ సేవలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ఉద్దేశించిన ఫీజు కన్నా ఎక్కువ ఎవరైనా అధిక ఫీజులు డిమాండ్ చేస్తే ఆర్డీఓ దృష్టికి తీసుకురావాల్సినదిగా కోరారు. అటు వంటి ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. గురజాల రెవిన్యూ డివిజన్ పరిధిలో 28 మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. వివిధ మండలాలలోని సుమారు 12 మంది విలేజ్ సర్వేయర్లపై ఫిర్యాదులు వచ్చాయి అందులో వారు లంచాలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక సమాచారం అందింది. దీంతో సంబంధిత సర్వేర్లకు సోకాస్ నోటీసులు జారీ చేసినట్లు గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. సచివాలయం ద్వారా వచ్చిన భూ సమస్య ఫిర్యాదులను ఒక సంవత్సరంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు.

### గాంధీనగర్ సచివాలయంలో
## నేడు క్రెడిట్ క్యాంప్



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :**
పిడుగురాళ్ల రూరల్ మండలం గాంధీనగర్ సచివాలయం నందు గురువారం 10:30 గంటలకు 2024-2025 సంవత్సరంనకు బీసీ,ఈ బీసీ, జనరిక్ అభ్యర్థులకు రుణ మేళా నిర్వహిస్తున్నట్లు కమిష నర్ తెలిపారు. లబ్ధిదారులను సెల క్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేయ నున్నట్లు కావున లబ్ధిదారులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు,బ్యాంక్ పాస్ బుక్ రెండు సెట్లు తీసుకొని రుణమేళాకు రావ లసిందిగా కమిషనర్ పి శ్రీధర్ కోరారు.

# కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :**
కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో 2025 విద్యా సంవత్సరంలో బి. టెక్ ఇంజనీరింగ్ డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 110 మంది ఇంజనీరింగ్, డిప్లొమా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యసి స్తున్న విద్యార్థులు ప్రముఖ కోర్, సాఫ్ట్వేర్ కంపెనీలైన ఇన్ఫోసిస్ , జెడ్ ఎఫ్ గ్రూప్స్, టీవీఎస్ ఇంజనీరింగ్ ల లో ఉద్యోగాలు పొందారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర రెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణిక ఎంపికలలో ఉద్యోగాలు పొందిన ఇంజనీరింగ్ విద్యార్థులు గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలు పొందారని, వార్షిక వేతనం 3 లక్షల రూపాయలు వరకు పొందుతారని కళాశాల ఉపాధి కల్పన విభాగ అధిపతి డాక్టర్ పి ఎల్ మాధవ రావు తెలిపారు. మొత్తం 110 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డా. బి ఎస్ బి రెడ్డి తెలిపారు.



ఉద్యోగాలను పొందిన విద్యార్థులను ఇంజనీరింగ్ విభాగాధిపతులు డాక్టర్ యం సూర్య నారాయణ, డాక్టర్ బి శ్రీకాంత్, ప్రొఫెసర్ రాజు , డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ బి బిందు మాధవి, డాక్టర్ యం వెంకట్రావు తదితరులు లు అభినందించారు.

# సామాజిక వన రైతు సంఘం ఆధ్వర్యంలో డీఎఫ్ఓ ఆఫీసు ఎదుట ధర్నా

- జామాయిల్ వేలంపాటలో అవకతవకలు, అక్రమ రవాణాపై విచారణకు డిమాండ్
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వడ్డె హనుమారెడ్డి, కేవీవీ ప్రసాద్ హాజరు

**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:**
పల్నాడు డివిజన్ అటవీ శాఖ పరిధిలోని వినుకొండ పిడుగురాళ్ళ, మాచర్లలోని 218 వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్ర 50935 మెట్రిక్ టన్నులకు 2024 నవంబర్ 13, 20,27 తేదీలలో వేలం నిర్వహించారు. అలాగే కర్ర నరుకుడు ప్రారంభించిన వ్యాపారులు..ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ రవాణా ద్వారా కంపెనీలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారని సామాజిక రైతు సంఘం, ఏపీ రైతు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వడ్డె హనుమారెడ్డి, కేవీవీ ప్రసాద్ ఆరోపించారు. దీనిపై వెంటనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం సామాజిక వన రైతుల సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తాళ్లూరి బాబూరావు అధ్యక్షతన నరసరావుపేట పరిధిలోని జొన్నలగడ్డ డీఎఫ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా డీఎఫ్ఓ జి.కృష్ణప్రియాకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్రను వేలం




నిర్వహించడం ద్వారా రైతాంగానికి 1000 నుంచి 1500 దాకా ధర తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అటవీ శాఖ భూముల్లో రైతులకు నష్టం కలిగించేటువంటి జామాయిల్ పంటను నిషేధించి పండ్ల తోటలను పెంపకం చేయడం ద్వారా వన సంరక్షణ సమితికి, రైతులకి ఆదాయం సమకూర్చుందని అన్నారు. ఫారెస్ట్ అధికారులు నిర్వహించిన వేలంపాటలో కర్రని తరలిస్తున్న కంపెనీలు అక్రమ రవాణాకి పాల్పడటం అన్యాయం అన్నారు. జామాయిల్, సుబాబుల్ మార్కెటింగ్ కమిటీల ద్వారా ప్రభుత్వం గుర్తించిన వే బ్రిడ్జిల వద్ద అమ్మకాలు, కొనుగోలు పాత విధానాన్ని మరల పునః ప్రారంభించి డబ్బులు చెల్లించేటట్లుగా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
ప్రసాద్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితుల వలన, గిట్టుబాటు ధరలు రాక నష్టాల పాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు రైతాంగాన్ని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసి బాధ్యతారహితంగా వ్యవహరించటం సరైనది కాదన్నారు. అటవీ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రులకు అనేక మార్లు విజ్ఞాపనలు చేసినా స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిఎడల భవిష్యత్తులో రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రామాయపట్నం ఓడరేవు ప్రాంతంలో పేపర్ పరిశ్రమ నెలకొల్పాలని,విదేశాల నుంచి దిగుమతి అవుతున్న కర్ర గుజ్జుపై దిగుమతి సుఖాన్ని పెంచాలని, పేపర్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు.
ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు వీరారెడ్డి, కొల్లి రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి, వరప్రసాద్, ఎస్.కె హుస్సేన్, కాసా రాంబాబు, టీవీ శేషయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, భీమనాదం జయరా మిరెడ్డి, శేషయ్య, సుంకర అంజిరెడ్డి, చెరుకూరి వాసు, రొడ్డా అంజిరెడ్డి, ఉప్పలపాటి, రంగయ్య, తినబోయే వెంకటేశ్వర్లు, కోయ శీను, దాసరి వరహాలు, నాగేశ్వరావు, బ్రహ్మయ్య, ఎర్రం హరిబాబు పాల్గొన్నారు.

# పార్టీ రంగులు పులుముకున్న బార్ ఎన్నికలు

**నేడు సత్తెనపల్లి బార్ ఎన్నికలు.**

**ఢీ అంటే ఢీ అంటున్న ఇద్దరు న్యాయవాదులు.**

**గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతి.**

సత్తెనపల్లి మేజర్ న్యూస్: ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బారు అసోసియేషన్ ఎన్నికలు సత్తెనపల్లిలో ఆసక్తికరంగా మారాయి. గతంలో ఒకే ఆఫీసులో పనిచేసిన సీనియర్ జూనియర్ న్యాయవాదులు అధ్యక్ష పదవికి పోటీ పడటం మరింత ఉత్కంఠకు తెరలేపింది. భారీ ఎన్నికలు రాజకీయ రంగును కులుకుపోతుంటే నువ్వా నేనా అన్నట్లు పోటీ జరుగుతుంది. అభ్యర్థుల సైతం టిడిపి లీగల్ సెల్ కు చెందిన ముగ్గురు గంగూరి అజయ్ కుమార్ అధ్యక్ష పదవికి పోటీ పడుతుండగా, ఉపాధ్యక్షుడు గా సర్వేపల్లి సీతారామాంజనేయులు, సబ్ కోర్టు కార్యదర్శిగా జానీ ఖాజావలి, జనసేనకు చెందిన బయ్యవరపు నరసింహారావు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యదర్శిగా పోటీలో ఉన్నారు. మరోవైపు తెలుగుదేశం పార్టీకి మరోపక్క రాష్ట్ర పౌర హక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అధ్యక్ష పదవి పోటీ పడుతూ, ఉపాధ్యక్షుడిగా వైసిపి లీగల్సన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిన్న మణిబాబు పోటీ పడుతున్నారు. మరోవైపు 2024 ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన జొన్నలగడ్డ విజయకుమార్ సబ్ కోర్ట్ కార్యదర్శిగా పోటీలో ఉన్నారు. వైసిపి లీగల్ సెల్ కు చెందిన పొత్తూరి హరి మణికంఠ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్యదర్శిగా పనిలో ఉన్నారు. ఆయా పార్టీలకు సంఘాలకు చెందిన న్యాయవాదులు పోటీ పడుతుండటంతో ఈ ఎన్నికలు నియోజకవర్గంలో హార్ట్ టాపిక్ గా మారాయి. న్యాయవాదుల సైతం పోటీని ప్రతిష్టంగా తీసుకోవడంతో ఎన్నికలు పై జనాలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. సాధారణ ఎన్నికలకు తీసుకొని విధంగా న్యాయవాదులు తమదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరు వర్గాలు పార్టీలిస్తూ, మంతనాలు చేస్తూ, ఎత్తులు పై ఎత్తులతో రసవత్తరంగా మారింది. 146 మంది సభ్యులు ఉన్న భార్య ఎన్నికలు నియోజకవర్గ మొత్తం హీటెక్కిస్తున్నాయంటే అతి శక్తి కాదు. ఏది ఏమైనప్పటికీ రేపు సాయంత్రానికి న్యాయవాదుల బార్ ఎన్నికల ఉత్కంఠకు తెరపడనుంది.

## ట్రాఫిక్ సమస్యల తల ఎత్తుకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### – ట్రాఫిక్ డి.ఎస్.పి రమేష్



గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :

ట్రాఫిక్ సమస్యలు తలెత్తుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ డిఎస్పి రమేష్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పలు ప్రమాద ప్రాంతాలను, ట్రాఫిక్ రద్దీ ప్రదేశాలను పరిశీలించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వెస్ట్ ట్రాఫిక్ సిఐ సిహెచ్ సింగయ్య , ఇతర పోలీస్ అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా గుంటూరు టౌన్ లోని ఐబి బంగాళా ప్రాంతము, సుభాని హెూటల్, నల్లపాడు రోడ్డు, విఐపి రోడ్డు, చుట్టుగుంట సెంటర్, ఎత్తు రోడ్డు సెంటర్,



యమ్ టి బి సెంటర్, మూడు బొమ్మల సెంటర్, ఎస్ బి ఐ జంక్షన్, కంకరగుంట వేబ్రిడ్జి, శ్యామల నగర్ పెట్రోల్ బంక్, పట్టాభిపురం పోలీస్ స్టేషన్ రోడ్డులో ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలను పరిశీలించి స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు, స్టాప్ బోర్డులు, రేడియం స్టిక్కర్స్ మొదలగునవి ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు వె స్ట్ ట్రాఫిక్ సీఐ సిహెచ్ సింగయ్య,ఎస్సైలు సాంబశివ రావు నాయక్, శ్రీహరి, నరేంద్రలు ఉన్నారు.

## క్రెడిట్ క్యాంపుకు విశేష స్పందన



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:**

పిడుగురాళ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో జరిగిన క్రెడిట్ క్యాంప్ కు విశేష స్పందన లభించినట్లు ఎంపీ డీవో రామ చంద్రరావు తెలిపారు.

ఈ రుణ మేళాలో బీసీ ఈ బీసీ కమ్మ కాపు అర్జీదారులు, పాల్గొన్నారు. పిడుగు రాళ్ల మండల పరిధిలోని బ్రాహ్మణ పల్లి, జూల కల్లు, ఎస్బిఐ పిడుగురాళ్ల శాఖ, ఎస్బిఐ తుమ్మల చెరువు, చైతన్య గోదావరి బ్యాంక్‌లు రుణ మేళాలో పాల్గొన్నాయి. ఈ ఐదు బ్యాంకులు 150 మంది వద్ద అర్జీలు స్వీకరిం చినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఈవో పి ఆర్ డి, బ్యాంకు సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బీఎస్పీరాష్ట్ర కార్యదర్శి గా వరగాని ఏడుకొండలు

**గుంటూర్రు రూరల్ మేజర్ న్యూస్**



బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మార్చి 24వ తారీకున విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లొ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ప్రకటించారు. ఈరోజు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర నూతన కార్యవర్గంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు కు చెందిన వరగాని ఏడుకొండలు ని రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భం పురస్కరించుకొని వరగాని ఏడుకొండలు పత్రికా ప్రకటనలో బి.ఎస్.పి రాష్ట్ర నూతన కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ కి తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర కో ఆర్డినేటర్ బక్కా పరంజ్యోతి కి, రాష్ట్ర కో ఆర్డినేటర్ జె. పూర్ణ చంద్రరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర అధ్యక్షులు తనకు ఇచ్చినటువంటి బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ రాష్ట్రంలో పార్టీని శక్తివంతంగా నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

## 31వ తేదీకి ముందుగానే రేషన్ లబ్దిదారులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

**- జాయింట్ కలెక్టర్ సూరజ్**



నరసరావుపేట మేజర్ న్యూస్ :– ఈనెల 31వ తేదీకి ముందుగానే రేషన్ లబ్దిదారులు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని,సదరు ఈకేవైసీ ప్రక్రియను లబ్ధిదారులతో సత్వరమే పూర్తి చేయించవలసినదిగా జిల్లాలోని అందరూ పౌరసరఫరాల డిప్యూటీ తహసిల్దార్ల ను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ఆదేశించారు. ఈ ప్రక్రియను నూటికి 100 శాతం పూర్తి చేయాలని సూచనలు చేయాలన్నారు. దీనిని అమలు చేసేందుకు అనేక పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో ,రేషన్ షాపులలో డీలర్ వద్ద ఉన్న ఈ–పాస్ పరికరాలు ద్వారా, మొబైల్ యాప్ ద్వారా ఈకేవైసీ అప్డేట్ చేసుకోవచ్చునన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు మినహా, మిగిలిన లబ్దిదారులు ఈకేవైసీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఇది ముఖ్యంగా రేషన్ పంపిణీ వ్యవస్థను సక్రమమగా అమలు చేయడానికి, అక్రమ వినియోగాన్ని నివారించడానికి ఉపయోగపడుతుం దన్నారు.


## పాఠశాలల్లో మూడు సార్లు "తాగునీటి గంట"



నూజెండ్ల మేజర్ న్యూస్:–వేసవి ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల పాఠశాలల్లో విద్యార్థులకు రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ పాటించాలని నూజెండ్ల మండల విద్యాశాఖాధికారి రవిచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తాజాగా విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఉదయం 10, 11, 12 గంటలకు అందరూ పాఠశాలలలో విధిగా వాటర్ బెల్ సమయాలను అనుసరించాలని కోరారు. తాగునీరు విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా హెచ్ఎంలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిన్న తాజాగా విడుదలైన నవోదయ పరీక్షా ఫలితాల్లో నూజెండ్ల మండలం నుండి ముగ్గురు విద్యార్థులు సెలెక్ట్ అయినట్లు ఎంఈఓ రవిచంద్ర తెలిపారు. గొల్లపాలెం, కంభంపాడు, రవ్వవరం గ్రామాల్లోని విద్యార్థులు అక్షయ్ ,జిస్మిత్ ,ప్రైసీ లను అభినందించారు. ఈ విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు కారకులైన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఉరుసు మహోత్సవమునకు ఏర్పాట్లు

**– దర్గా ఈవో ముక్తార్ బాషా వెల్లడి**



పెదకాకాని,మేజర్ న్యూస్ :– హజారత్ సయ్యద్ బాజీ షాహిద్ ఔలియా వారి 537వ, ఉరుసు మహోత్సవాలకు ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా ఈవో ముక్తార్ బాషా తెలిపారు. దర్గా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ఈనెల 29న రాత్రి గం. 10 లకు ముస్లిం జండా చెట్టు వద్ద నుండి అత్యంత వైభవోపేతంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారుల ఈ కార్యక్రమానికి వివిధ శాఖల వారి సమన్వయ సహాయ సహకారాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ మహ్మద్ ఆలీ, సూపర్ ఇండెంట్ ఇబ్రహీం బేగ్, దర్గా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## పాస్టర్ ప్రవీణ్ పగడాలకి ఘన నివాళి

**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్**

బీమ్ సేన సేవాదళ్ అధ్యక్షులు నీలపు నీలాంబరం ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు లాడ్జి సెంటర్లో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పట్ల సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్స్, దళిత సంఘాల నాయకులు, మేధావులు, సానుభూతిపరులు అనేకమంది ప్రజానికం పాల్గొని సంతాపం ప్రకటించారు. పాస్టర్లు పట్ల జరుగుతున్న హత్యాకాండ మీద, దాడులు మీద ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పాస్టర్లకి క్రైస్తవులకి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయా నాయకులు కోరారు. ఉన్నతమైన పదవులు ఉంటూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మనువాదం గొప్పదని మాట్లాడటం వల్లే పాస్టర్ల మీద దాడులు జరుగుతున్నాయని పలువురు నాయకులు ఆరోపించారు. ఈ నిరసన సంతాప కార్యక్రమంలో వి సి కె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, పలు మినిస్ట్రీస్ సంబంధించిన పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఉప ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలి

**- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి**




**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:**
పల్నాడు జిల్లా నరసరావుపేట, రొంపిచర్ల మండలాల పరిధిలోని వైస్ ప్రెసిడెంట్ ఉప ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. 'తెలుగుదేశం పార్టీకి మెజార్టీ లేకపోయినా దౌర్జన్యంతో ఈ స్థానాలను గెలవాలని చూస్తున్నారని' మాజీ ఎమ్మెల్యే, నరసరావుపేట వైసీపీ ఇంఛార్జి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నరసరావుపేట మండలంలో 17 మంది ఎంపీటీసీలు ఉన్నారు. అందులో ఒకరు చనిపోవడంతో వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక వచ్చింది. మిగిలిన 16 మందిలో ఒక్కరు కూడా టీడీపీ తరఫున గెలవలేదనీ, మా పార్టీలో గెలిచిన ఒక ఎంపీటీసీ అప్పట్లోనే అధికార పార్టీలో చేరారు. ఆ సమయంలో టీడీపీకి ఒక్క ఎంపీటీసీ స్థానం మాత్రమే ఉందని, ఆ ఒక్కరితో వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక ఎలా గెలవాలనుకుంటున్నారు అని ప్రశ్నించారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ఎంపీటీసీలను స్టేషన్లో కూర్చోబెట్టి బెదిరించాలని చూస్తున్నారని విమర్శించారు. రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామంలో ఎస్సై వార్డ్ మెంబర్లకు ఫోన్ చేసి బెదిరించారని ఆరోపించారు. రెండు మండలాల ఎంపీపీలు మా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే ఉన్నారు. ఇది వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక కాదని నామమాత్రం మాత్రమే అని పేర్కొన్నారు. దీనికోసం ఎంపీటీసీలను, వార్డు మెంబర్లను బెదిరించడం , నేరుగా వారికి ఫోన్లు చేసి ఎమ్మెల్యే అరవింద్ బాబు మాట్లాడి బెదిరింపులకు పాల్పడటం అన్యాయం కాదన్నారు. మీరు ఎప్పుడో గెలిచారు, ఇప్పుడు మేము గెలిచాం. దౌర్జన్యం చేసైన గెలుస్తాం. మీరు మాకు సపోర్ట్ చేయండి అని బెదిరిస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసం అన్నారు.

## వివిఐటియూలో నేషనల్ ఆర్చరీ చాంపియన్షిప్



పెదకాకాని,మేజర్ న్యూస్ :- వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరు కూరి లెనిన్ వోల్గా మెమోరియల్" నేషనల్ ఆర్చరీ చాంపియన్షిప్" పోటీలను ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఆథారిటీ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు, అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత సంజీవ సింగ్ వివిఐటి యూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. మార్చి 26 నుండి 29 వరకూ నాలుగు రోజుల పాటు వివిఐటి విశ్వవిద్యాలయం క్యాంపస్ నందు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు పాల్గొనేందుకు దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 900 మంది ఆర్చరీ క్రీడాకారులు, కోచ్లు హాజరయ్యారు. అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించనున్న పోటీలలో తొలి రోజున 723 మంది పోటీదారులు పాల్గొన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లడుతూ ఆర్చరీ క్రీడాకా రులు అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రఖ్యాతిని పెంచాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా అర్చరీ క్రీడకు విశేష ఆదరణ లభిస్తుందనీ ఆంధ్రప్రదేశ్లో ఆర్చరీ క్రీడాకా రులను ప్రోత్సహిస్తున్న చెరు కూరి లెనిన్ వోల్గా అసోసియేషన్ కృషి ప్రసంసనీయమన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఏపి క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించడమే సిఎం చంద్రబాబు లక్ష్యం అని తెలిపారు. అమరావతి వేదికగా స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునట్లు వివరించారు. వివిఐటియూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ నేషనల్ ఆర్చరీ చాంపియన్ షిప్ క్కు వివిఐటి యూనివర్శిటీ వేదిక కావడం సంతోషంగా ఉందనీ ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో వివిఐటియూ ప్రిన్సిపల్ డా. వై.మల్లికార్జునరెడ్డి, ఏపి అర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చెరకురి సత్యం, వివిఐటియూ ఫిజికల్ డైరెక్టర్ డా.ఎన్. అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లింగాకార బుట్టల ఏర్పాటుపై అవగాహన





**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :**
వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను ఎలా ఏర్పాటు చేయాలో రైతులకు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డి ఏఏ టి టి సి నర్సరావుపేట ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఈ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం చాగంటి వారి పాలెం గ్రామంలో జరిగిన గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో వివిధ రకాల చీడపీడల యాజ మాన్యం గురించి రైతులకు,ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. నార్నెపాడు లో ఎరువుల వాడకంపై అవగాహన. మండల పరిధిలోని లోని నార్నెపాడు గ్రామం లో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం పై అవవాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఏవో అరుణ గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొనడం జరిగింది.

## ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి

**- అల్లర్లు గొడవలు సృష్టించాలని చుస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు.**



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్:**
జిల్లాలో గురువారం జరుగనున్న ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు జరుగునున్న ఎన్నికల్లో గొడవలు అల్లర్లు సృష్టించాలని చూస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రత మరియు బందోబస్తు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వ హించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల సమయంలో 30 యాక్ట్ అమలులో ఉంటుందని, 144 సెక్షన్ అమలు పరచడం జరుగుతుందన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్ల తో నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధన ఉల్లంఘిస్తే ,అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అందరూ సహకరించాలని ఎస్పీ కోరారు.

### నరసరావుపేట న్యాయాధికారిణి
## సత్యశ్రీ కి పీహెచ్డీ పట్టా

**నరసరావుపేట మేజర్ న్యూస్:**
13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి సత్యశ్రీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం పీహెచ్డీ అందజేసింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలేజీ ఆఫ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్కె సీతామాణిక్యం ఆధ్వర్యంలో పీహెచ్డీ పూర్తిచేశారు. ఎన్నికలలో ప్రచారాలు, సాంకేతిక విధులు, చట్టపరమైన నైతిక సందిగ్ధతలు, శాస్త్రీయంగా సరిదిద్దుకునేందుకు తీసుకోవలసిన చర్యలు, మీడియా పాత్ర, వ్యక్తిగత స్వేచ్ఛ తదితర అంశాలపై ఆమె పరిశోధన చేశారు.

## బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



**తెనాలి, మేజర్ న్యూస్**
బీజేపీ తెనాలి పశ్చిమ మండల సమావేశం స్థానిక మారీస్ పేటలో బుధవారం నిర్వహించారు. మండల అధ్యక్షులు ఎర్రం రాజు సందీప్ రాజు సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతి రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సంస్థాగతంగా భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసుకోవాలని సూచించారు. మండల కమిటీ సమర్థవంతంగా పనిచేసే రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో కౌన్సిలర్గా గెలిచి బిజెపి జెండా ఎగరవేయాలని అన్నారు . ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. రాష్ట్ర కార్మిక సభ్యురాలు ఎడ్లపాటి స్వరూపారాణి మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలంగా ఉందని ఈ కూటమి ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ అందే విధంగా తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కటారి వాసుదేవ నాయుడు,, జిల్లా అధికార ప్రతినిధి అనంతచార్యులు, సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, యువమోర్చా అధ్యక్షులు మైలా హరికృష్ణ, బిట్రా కనకదుర్గ, సింగంరాజు కనకదుర్గ, మండల ప్రధాన కార్యదర్శి రాచూరి లీల ఫణి కృష్ణ మండల ఉపాధ్యక్షులు కార్యదర్శులు కోశాధికారి నేతలు పాల్గొన్నారు

**సైకిల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. చదలవాడ. అరవింద్ బాబు**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
రోటరీ క్లబ్ ఆఫ్ నరసరావుపేట వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివి. నరసరావుపేటలోని రోటరీ క్లబ్ నరసరావుపేట ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ ప్రాజెక్ట్ వారి సహకారంతో నరసరావుపేటలోని రాయపాడు రోడ్ లో గల వాగ్దేవి డిగ్రీ కళాశాల నందు సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డా.చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు రోటరీ క్లబ్ ఆఫ్ నరసరావుపేట వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి మాట్లాడి వారిని అభినందించారు అదేవిధంగా సిఎస్ఆర్ ప్రాజెక్ట్ డా"రామలింగారెడ్డి మాక్స్ విజన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని మున్సిపల్ స్కూల్లో చదువుతున్న 40 మంది విద్యార్థులకు సైకిల్ పంపిణీ ఏర్పాటు చేయటం ఎంతో అభినందయకరమని అదేవిధంగా రామలింగారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు గురించి విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో డా.చిలుకూరు శరత్ బాబు డా.రామలింగారెడ్డి తాళ్ల రాజ శేఖర్ రెడ్డి కెపి రంగారావు మరియు రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## పట్టణంలో కమీషనర్ పర్యటన

**తెనాలి, మేజర్ న్యూస్**
పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమీషనర్ బి శేషన్న బుధవారం పర్యటించారు. తొలుత 21 వ వార్డులో పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ, పన్ను వసూలు, హోమ్ కంపోస్ట్ విధానంపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం 22, 24 వార్డుల్లో పర్యటించి కాలువల్లో వ్యర్థాలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రక్షిత మంచినీటి పైప్ లైన్లు లీకేజీ వెంటనే చక్కదిద్దాలని ఆదేశించారు. 23 వ వార్డులో పర్యటించి పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్ ఆర్ నగర్ కాలనీ రెండవ లైన్ల ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ ప్రాంతంలో రక్షిత మంచినీటి లీకేజీలు సరిచేయాలని ఆదేశించారు. అనంతరం 28 వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో
# "శ్రీ విజేత" విజయభేరి







**వినుకొండ మేజర్ న్యూస్ :** నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో వినుకొండలోని శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన "జవహర్ నవోదయ ప్రవేశ పరిక్ష -2025" ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించారని శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్ డైరెక్టర్లు కావూరి సాయి కుమార్, ఆవులమంద బ్రాహ్మయ్యలు తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షలో సీట్లు పొందిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినదించి జ్ఞాపికలను బహుకరించి అభినందించారు. కాగా తమ పాఠశాల స్థాపించిన తొలి ఏడాది లోనే తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటం పట్ల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విజేతల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలతో నిండుతున్న మురుగు కాల్వలు

- ప్రధాన కాలువలలే దోమల ఉత్పత్తి కేంద్రాలు
- కాలువల నిండా చెత్త, చేదారం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు





**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణం లోని ప్రధాన కాలువలన్నీ మూసీ నదిని తలపిస్తున్నాయి. ముఖ్యంగా గుంటూరు రోడ్ కు ఇరువై పుల వున్న ప్రధాన కాలువలలో డిస్పొసబుల్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు చెత్త, చేదారం తో నిండిపోయి అద్వాన్నంగా వున్నాయి. ఈ ప్రాంతం పెద్ద ఎత్తున లార్వా తో నిండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీనితో పాటు పాలాద్రి కాలువ, పినపాడు పంట కాలువ తో పాటు నాజారుపేట తదితర ప్రాంతాలలో వున్న ఖాళీ స్థలాలలో నీరు నిల్వ ఉండి ఎటు పోయే దారి లేక దోమల అవాసాలుగా మారుతున్నాయి. పాలాద్రి కాలువ, పినపాడు పంట కాలువ లలో ప్లాస్టిక్కవర్లు, డబ్బాలు, చెత్త విపరీతముగా పేరుకు పోయి దుర్గందం వెదజళుతున్నాయి. కాలువల పరిసరాలలో నివసించే ప్రజలు ఈవాసనకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఖాళీ స్థలాలలో నీరు నిల్వ ఉంటున్న పట్టించుకొనేవారే లేరు. స్థల యజమానులకు అక్కడక్కడా నామమాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపు కొంటున్నారన్నా విమర్శలు వస్తున్నాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడొద్దాంటూ పురపాలక సంఘం వారు విస్తృతం గా ప్రచారం చేయడం తో పాటు, జరిమానాలు విదిస్తున్న కవర్ల వాడకం కొనసాగుతూనే వున్నది. కవర్ల నివారించటం పై కొందరు సిబ్బంది అలసత్వం ప్రదర్శించటం వల్లనే నివారణ జాప్యం జరుగుతుందనే ఆరోపణలు వున్నాయి. కొందరు వ్యాపారులు కూడా మున్సిపల్ వారు చేస్తున్న హెచ్చరికలు ఖాతరు చేయకుండా విచ్చలవిడిగా చాటుమాటుగా కవర్ల విక్రయం కొనసాగిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. తడి, పొడి, హాని కర చెత్త లుగా వేరువేరు గా సేకరించలన్న అధికారుల ఆదేశాలను అటు కార్మికులు, నగరదీపికలు బేఖాతారు చేస్తున్నారు. చెత్త సేకరణరణ పై ఎన్ని సమావేశాలు ఏర్పాటు చేసి చెప్పిన మూడు బుట్టల విధానం అమలుపై అలసత్వం ప్రదర్శిస్తూనే వున్నారు. ఇళ్ల నుండి సరైన రీతిలో చెత్త సేకరణ జరగక పోవడం వల్ల చెత్త ను కాలువలలో వేస్తున్నారు ఈ చేత్త ప్రధాన కాలువలోకి చేరి ఎక్కడి కక్కడ పేరుకు పోతున్నాయి. ఈ విధంగా చెత్త పేరుకున్న ప్రాంతంలో నీరు పారుదల కాక లార్వా తయారై దోమల సంఖ్య పెరిగి పోతుంది. మున్సిపల్ సిబ్బంది ఎక్కడ డబ్బులు వస్తాయా అన్న ఆలోచన లో తప్ప, పారిశుధ్య నిర్వహణ పై దృష్టి సారించటం లేదన్న ఆరోపణలు వెళువెత్తుతున్నాయి. ఈ ప్రధాన కాలువలలో ప్రతీసారి జెసిబి, కార్మికులతో శుభ్రం చేయి స్తున్న మరల అదే విధంగా చెత్త నిల్వలు పేరుకు పోతున్నాయి. దానితో పాటు పారిశుధ్య నిర్వహణ సిబ్బంది కి వివిధ రకాల సర్వేల పేరుతో ఆయా పనులు అప్పగించటం తో పారిశుధ్య నిర్వహణ దృష్టి సారించాలేక పోతున్నామన్న గుసగుసలు వినబడుతున్నాయి. అంతే కాకుండా సిబ్బంది మధ్య సమన్వయం లోపించటం కూడా కూడా ఒక కారణం గా చెప్పవచ్చు. వెరసి పారిశుధ్య అధ్వానానికి కారణం



అవుతుంది. ఒక వైపు మురుగు వాసన, మరోవైపు దోమలతో ప్రజలు మాత్రం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి కాలువల ను శుభ్రం చేయించి, దోమల నివారణ కు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పారిశుధ్య నిర్వహణలో శానిటరీ ఇన్స్పెక్టర్లు వ్యవహరిస్తున్న తీరును ఉన్నతాధికారాలు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇన్స్పెక్టర్లు నిబంధనలు అతిక్రమించినా, తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కప్పిపుచ్చుతున్నారన్న వాదనలు ఉన్నాయి. ఇందుకు వారి నుండి ముడుపులు అందుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికయినా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుదలకు మెరుగైన చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం : బి.శేషన్న, మున్సిపల్ కమీషనర్**

ఖాళీస్థలలాల్లో ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగు కాల్వలలో వ్యర్థాలు వేయరాదని ప్రజలు, వ్యాపారస్తులను కోరుతున్నాం. మురుగునీరు సక్రమంగా పారుదల జరిగేలా చర్యలు తీసుకుంటాం.

## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.

## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) — బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు — గుంటూరు జిల్లా ఇన్‌చార్జి — సెల్ : 9959426987
ఆర్.ధాపుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) — స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు — సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి — సెల్ : 9030880455
జి.హిరన్మాయి(కన్నల్) — నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి, జిల్లా క్రైమ్ రిపోర్టర్
చెట్టిపోగు కాశి — దాచేపల్లి రిపోర్టర్ — సెల్ : 9963343327
శేషగిరి రాజు — మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి — సెల్ : 8341408201
వై.ఏసుబాబు — గురజాల ఆర్సీ ఇన్‌చార్జి — సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు — సత్తెనపల్లి రిపోర్టర్ — సెల్ : 9866246951
చెవుల రంగారావు — మెడికల్ రిపోర్టర్, గుంటూరు — సెల్ : 9490544635
యం.కృష్ణ — మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి — సెల్ : 9393309149
వి.రవికుమార్ — తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి — సెల్ : 99083 38200
డి. చైతన్య — వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి — సెల్ : 9381968453
జి.ఏలియా — ముప్పాళ్ళ రిపోర్టర్ — సెల్ : 9392231959
వి.వెంకటరెడ్డి — బొల్లాపల్లి రిపోర్టర్ — సెల్ : 80191 99991
బి.సాంబశివరావు — రాజుపాలెం రిపోర్టర్ — సెల్ : 9949382676
రమేష్ — దుగ్గిరాల రిపోర్టర్ — సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు — పెదకాకాని రిపోర్టర్ — సెల్ : 9948175840
కె.నాగరాజు — రిపోర్టర్, గుంటూరు — సెల్ : 7799881000
డి.రమేష్ — ఈపూరు రిపోర్టర్ — సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ — నూజెండ్ల రిపోర్టర్ — సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ — శావల్యాపురం రిపోర్టర్ — సెల్ : 7989434737
అక్కిరెడ్డి — నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ — సెల్ : 9849134987
పి.మణికంఠ — మాచర్లటౌన్ రిపోర్టర్ — సెల్ : 7013169885
ఎస్.డి.మహబూబ్ — మాచర్ల క్రైం రిపోర్టర్ — సెల్ : 9989124898
పి.వెంకటేశ్వర్లు — దుర్గి రిపోర్టర్ — సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ — వెల్దుర్తి రిపోర్టర్ — సెల్ : 9912818723
ఎస్.విజయభాస్కర్ — గుంటూరు రిపోర్టర్ — సెల్ : 9440822538
షేక్ నాగూర్ — నకరికల్లు రిపోర్టర్ — సెల్ : 98489 26300
ఎం.కోటేశ్వరరావు — మాచవరం రిపోర్టర్ — సెల్ : 6303775169
డి.మల్లికార్జునరావు — యడ్లపాడు రిపోర్టర్ — సెల్ : 8309237441
పి.ఆనంద్ — వినుకొండ రూరల్ రిపోర్టర్ — సెల్ : 8125125239
నాగరాజు — మంగళగిరి టౌన్ రిపోర్టర్ — సెల్ : 9032258913
రమేష్ — నరసరావుపేట రూరల్ రిపోర్టర్ — సెల్ : 7075942600
తేళ్ల రవీంద్రబాబు — గుంటూరు రిపోర్టర్ — సెల్ : 7396234032

"నేటి దినపత్రిక సూర్య"
ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.